సాక్షి ప్రకాశం

శుక్రవారం । 25 । ఆగస్టు । 2023



అయ్యయ్యో వద్దమ్మా!

బాల్య వివాహాల కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే ప్రభుత్వ పథకాలు వర్తించవని స్పష్టం చేసింది. - IIలో..



ఉసురుతీసిన కుటుంబ కలహాలు

కుటుంబ కలహాలు ఇద్దరి ఉసురు తీశాయి. జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఒక పురుషుడు, మరో మహిళ ఆత్మహత్య చేసుకున్నారు. - IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
39.3/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌ సీపీ జిల్లా కమిటీ నియామకం

- 50 మందితో కమిటీని ప్రకటించిన పార్టీ కేంద్ర కార్యాలయం



జిల్లా అధ్యక్షుడు
జంకె వెంకటరెడ్డి

ఒంగోలు: వైఎస్సార్‌ సీపీ జిల్లా కమిటీని నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత, సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షునిగా జంకె వెంకటరెడ్డి, కోశాధికారిగా మందాడి కృష్ణారెడ్డి (కనిగిరి)తో కలిపి మొత్తం 50 మందితో కమిటీని నియమించినట్లు పేర్కొంది.

ఉపాధ్యక్షులు...
బాలిశెట్టి నాగేశ్వరరావు (ఒంగోలు), ఇనగంటి పిచ్చిరెడ్డి (సంతనూతలపాడు), ఒంగోలు మూర్తిరెడ్డి (వై.పాలెం).

ప్రధాన కార్యదర్శులు...
పోకూరి కోటేశ్వరరావు (కొండపి), గట్టినేని అయ్యన్న (సంతనూతలపాడు), కంఠే గంగయ్య (దర్శి), పంది రత్నరాజ (ఒంగోలు), గుర్రపుసాల శ్రీనివాసరావు (మార్కాపురం), కమ్మ సురేష్‌బాబు (ఒంగోలు).

కార్యదర్శులు...
ఆర్‌.వెంకటయ్య (దర్శి), షేక్‌ మొహమ్మద్‌ ఆలీ (సంతనూతలపాడు), సామంతుల రవి కుమార్‌ రెడ్డి (కొండపి), పడిదపు మస్తాన్‌ (వై.పాలెం), ఉడుముల రామనారాయణ రెడ్డి, వెంకటరామిరెడ్డి (మార్కాపురం), పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి (గిద్దలూరు), గుర్రం వెంకయ్య (ఒంగోలు).

కార్యనిర్వాహక సభ్యులు...
గుర్రం అశోక్‌బాబు, లింగాల తిరుమల కొండయ్య (వై.పాలెం), మారం శ్రీనివాసరెడ్డి, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (దర్శి), చుండే నగేష్, మద్రిపూడి శ్రీనివాసరావు, చుండి శ్రావణ్‌కుమార్‌ (కొండపి), బత్తుల ప్రసన్న (సంతనూతలపాడు), కూరపాటి రమేష్, జి.వెంకటరెడ్డి (ఒంగోలు), గంగవరపు పద్మ, మార్తాల ఓబుల్‌రెడ్డి, నూకతోటి వెంకట్రావు, షేక్‌ రహంతుల్లా (కొండపి), కూరటి మహాలక్ష్మి, మందా లక్ష్మీదేవి, బండి అశోక్, దూదేకుల ప్రసాద్, జవ్వాజి వెంకట రంగారెడ్డి (మార్కాపురం), జె.అలెగ్జాండర్, జింకా గోపాల్, బండారు నిర్మలాదేవి (గిద్దలూరు), దేవేండ్ల కృష్ణ, షేక్‌ ఖాజా, షేక్‌ ఖాదర్‌బాషా, ఎం.నాగమల్లీశ్వరి, బత్తుల అంజయ్య (కనిగిరి), జొన్నకూటి సుబ్బారెడ్డి (దర్శి), షేక్‌ రబ్బాని (మార్కాపురం), బత్తుల దేవరాజు, దేవర వెంకటేశ్వర్లు(కనిగిరి).

పొగాకు రైతుకు ఈ ఏడాది స్వర్ణయుగంగా మారింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ధరలు పలికాయి. కేజీ ధర అత్యధికంగా రూ.289 పలికి రికార్డు సృష్టించింది. ఊహించని విధంగా ఒక్కో బ్యారన్‌కు కనిష్ఠంగా రూ.2 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.5 లక్షల వరకూ లాభాలు ఆర్జించి రైతులు జాక్‌పాట్‌ కొట్టారు. ఇప్పటి వరకూ సుమారు రూ.3 వేల కోట్ల మేర లావాదేవీలు జరిగాయి. బోర్డు 87.94 మిలియన్‌ కేజీల కొనుగోలుకు అనుమతివ్వగా రికార్డు స్థాయిలో 122.8 మిలియన్‌ కేజీల కొనుగోళ్లు జరిగాయి. రీజియన్‌ పరిధిలోని 11 ప్లాట్‌ఫాంలలో కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే 7 వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ముగిసాయి. వారంపదిరోజుల్లో అన్ని కేంద్రాల్లో ఈ ప్రక్రియ పూర్తి కానుందని పొగాకు బోర్డు అధికారులు తెలిపారు.



టంగుటూరు వేలం కేంద్రంలో హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



పొగాకు రైతు.. జాక్‌పాట్‌...

- సీజన్‌లో రూ.3 వేల కోట్ల లావాదేవీలు
- రికార్డు స్థాయిలో ధరలు
- కేజీకి అత్యధికంగా రూ.289
- పొగాకు బోర్డు లక్ష్యం 87.94 మిలియన్‌ కేజీలు
- కొనుగోలు చేసింది 122.8 మిలియన్‌ కేజీలు
- అనుమతికి మించి.. 136.9 శాతం కొనుగోలు
- 7 ప్లాట్‌ఫాంలలో ముగిసిన వేలం ప్రక్రియ
- మరో పది రోజుల్లో వేలం పూర్తి
- రైతులు అత్యాశకుపోవద్దని పొగాకు బోర్డు హెచ్చరికలు

చీమకుర్తి: పొగాకు బోర్డు రీజియన్‌ పరిధిలోని 11 వేలం ప్లాట్‌ఫాంలలో ఈ ఏడాది 87.94 మిలియన్‌ కేజీలు కొనుగోలు చేసేందుకు పొగాకు బోర్డు అనుమతిచ్చింది. రైతులు అదనంగా కూడా సాగుచేయడం, మార్కెట్‌లో పొగాకు కొనుగోళ్లకు డిమాండ్‌ ఏర్పడటంతో రికార్డు స్థాయిలో అనుమతికి మించి మొత్తం 122.8 మిలియన్‌ కేజీల పొగాకును వ్యాపారులు కొనుగోలు చేశారు. 136.9 శాతం కొనుగోళ్లు జరిగాయంటే ఈ ఏడాది ఎంత పెద్ద మొత్తంలో పొగాకు బయ్యర్ల నుంచి డిమాండ్‌ ఏర్పడిందో స్పష్టమవుతోంది. గతంలో కొనుగోళ్లు ప్రారంభమైనప్పటి నుంచి ఒక్క ఐటీసీ కంపెనీ తప్ప మిగిలిన చిన్న కంపెనీలు ఏదో మొక్కుబడిగా పాల్గొనేవి. అందుకు భిన్నంగా ఈ ఏడాది ఐటీసీ కంపెనీతో పాటు మిగిలిన చిన్న కంపెనీలు కూడా పోటీపడి పొగాకు దక్కించుకునేందుకు ఉత్సాహం చూపించాయి. కంపెనీల మధ్య పోటీ కారణంగానే వేలం పాటలు ప్రారంభమైన మొదటిరోజు నుంచే కేజీ పొగాకు ధర రూ.200 నుంచి మొదలైంది. కొనుగోళ్ల ముగింపునకు వచ్చే చివరి రోజుల్లో అత్యధికంగా రూ.289 పలికి చివరకు స్థిరంగా రూ.275 వద్ద నిలిచిందంటే పొగాకుకు ఎంత డిమాండ్‌ వచ్చిందో అవగతమవుతోంది. కేజీ పొగాకు ధర అత్యధికంగా రూ.289 పలకడంతో ఒక్కో బ్యారన్‌కు కనిష్ఠంగా రూ.2 లక్షలు, గరిష్ఠంగా రూ.5 లక్షల వరకు రైతులు లాభాలు ఆర్జించారు.

7 కేంద్రాల్లో ముగిసిన కొనుగోళ్లు...
రీజియన్‌ పరిధిలోని 11 ప్లాట్‌ఫాంలలో పొగాకు కొనుగోళ్లు ముగింపునకు చేరాయి. ఇప్పటికే వెల్లంపల్లి, ఒంగోలు–2, కొండపి, కనిగిరి, పొదిలి, కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. కందుకూరు–2, టంగుటూరు కేంద్రాల్లో స్క్రాప్‌ కొనుగోలు చేస్తున్నారు. ఇది కూడా మరో నాలుగైదు రోజుల్లో పూర్తి కానున్నట్లు బోర్డు అధికారులు ధ్రువీకరించారు. ఒంగోలు–1, కందుకూరు–1లో ఇంకా వేలం ప్రక్రియ జరుగుతూనే ఉంది. వారంపది రోజుల్లో కూడా అక్కడ పూర్తికావచ్చని పొగాకు బోర్డు ఆర్‌ఎం తులసి తెలిపారు.

పెరిగిన బ్యారన్, పొలాల కౌలు ధరలు...
ఈ సంవత్సరం పొగాకుపై అత్యధిక లాభాలు రావడంతో రానున్న సంవత్సరంలో పొగాకు సాగు చేసేందుకు రైతుల్లో ఆసక్తి పెరిగింది. దాంతో బ్యారన్‌ అద్దె గతంలో రూ.50 వేల నుంచి రూ.60 వేల మధ్య ఉండగా, ప్రస్తుతం రూ.1.50 లక్షలకు పెరిగింది. పొలం కౌలు గతంలో ఎకరానికి రూ.15 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.25 వేల నుంచి రూ.30 వేలకు పెరిగింది.

రూ.3 వేల కోట్ల మేర లావాదేవీలు...
కేజీ పొగాకు ధర సరాసరిన రూ.220 నుంచి రూ.250 పలికింది. మొత్తం కొనుగోలు చేసిన పొగాకు పరిమాణం 122.8 మిలియన్‌ కేజీలు. ఆ లెక్కన పొగాకు బయ్యర్లు కొనుగోలు చేసిన పొగాకు విలువ రూ.3 వేల కోట్ల సంపదను కంపెనీల నుంచి రైతులు పొందగలిగారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దాంతో ఒక్కో రైతుకు లక్షల్లో లాభాలు గడించడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా పొగాకు రైతులు.. ప్రధానంగా ప్రకాశం జిల్లాలోని రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

విదేశాల్లో పెరిగిన డిమాండ్‌...
పొగాకును ఎక్కువగా పండించే చైనాలో కరోనా కారణంగా ఈ ఏడాది పొగాకు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. చైనాతో పాటు జింబాబ్వే, బ్రెజిల్‌లో పొగాకు ఉత్పత్తులు భారీగా పడిపోవడంతో ఇండియాలో సాగు చేసే పొగాకుకు మంచి డిమాండ్‌ ఏర్పడింది. ఫలితంగా రైతులకు గతంలో ఎప్పుడూ ఊహించని ధరలు రావడంతో ఇదంతా నిజమేనా.? అంటూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వేలం కేంద్రాల వారీగా కొనుగోళ్ల ధరలు

బ్లాక్‌ సాయిల్‌ పొలాల వేలం కేంద్రాలు

వేలం కేంద్రం	మిలియన్‌ కేజీలు	సరాసరి ధర
వెల్లంపల్లి–2	12.20	రూ.212.5
ఒంగోలు–1	14.71	రూ.219.1
ఒంగోలు–2	10.76	రూ.216.1
టంగుటూరు–1	13.88	రూ.220.9
కొండపి	14.17	రూ.218.0
మొత్తం	65.74	రూ.217.57

లైట్‌ సాయిల్‌ పొలాల వేలం కేంద్రాలు

వేలం కేంద్రం	మిలియన్‌ కేజీలు	సరాసరి ధర
పొదిలి–1	12.29	రూ.214.7
కనిగిరి	06.51	రూ.208.1
కందుకూరు–1	12.99	రూ.221.8
కందుకూరు–2	11.47	రూ.218.0
కలిగిరి	05.52	రూ.205.4
డీసీ పల్లి	08.30	రూ.208.7
మొత్తం	57.10	రూ.214.59

చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది పొగాకు ధరలు

పొగాకు చరిత్రలోనే గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ సంవత్సరం రైతులకు ధరలు వచ్చాయి. నాణ్యమైన పొగాకు కేజీ ధర అత్యధికంగా రూ.289 పలికింది. పొగాకు కొనుగోళ్లకు అనుమతిచ్చింది 87.9 మిలియన్‌ కేజీలకు కాగా, 122.8 మిలియన్‌ కేజీల కొనుగోళ్లు జరిగాయి. 136.9 శాతం పొగాకు కొనుగోళ్లు జరిగాయి.

– తులసి, పొగాకు బోర్డు ఆర్‌ఎం, ఒంగోలు

వచ్చే ఏడాది కూడా ఇవే ధరలు ఉంటాయని చెప్పలేం



కరోనా కారణంగా చైనా, బ్రెజిల్, జింబాబ్వేలలో పొగాకు ఉత్పత్తులు పడిపోవడంతో భారతదేశంలోని పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌ ఏర్పడింది. దానివలన నాణ్యమైన పొగాకుతో పాటు మీడియం, లోగ్రేడ్‌ వంటి పొగాకుకు కూడా గరిష్ఠంగా కేజీ రూ.275 వరకు ధరలు పలికాయి. ఇదే విధంగా వచ్చే సంవత్సరం కూడా ఉంటుందని రైతులు ఆశకు పోవద్దు. వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో చైనా, బ్రెజిల్, జింబాబ్వే నుంచి పొగాకు పోటీ భారీగానే ఉండే అవకాశం ఉంది. దానిని గమనించకుండా పొగాకు రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తే వచ్చే ఏడాది నష్టాలకు గురవుతారు. అందువలన పరిమితంగానే సాగుచేసుకోవాలి.

– మారెడ్డి సుబ్బారెడ్డి, పొగాకు బోర్డు సభ్యుడు, వైఎస్సార్‌ సీపీ రైతు విభాగం రీజినల్‌ కో ఆర్డినేటర్‌

ప్రజలందరి నమ్మకం జగనన్నే

- ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఒంగోలు 5వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం
- ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాల వివరాలు చదివి వినిపించిన ఎమ్మెల్యే
- పథకాలతోనే పచ్చగా ఉన్నామన్న లబ్ధిదారులు, స్థానికులు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్‌: ప్రజలందరి నమ్మకం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని 5వ డివిజన్‌లో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని మహేంద్రనగర్‌ మూడో లైన్‌తో పాటు గోపాల్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలినేని మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్‌ కార్యక్రమం ఇటీవల ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి గడపలో స్వయంగా అడిగి బాలినేని తెలుసుకున్నారు. గడిచిన నాలుగేళ్లలో ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందనే దానిపై స్థానిక మహిళలను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. చంద్రబాబు హయాంలో డ్వాక్రా మహిళలు, రైతులను ఏ విధంగా మోసం చేశారో స్వయంగా మహిళలే బాలినేనికి వివరించారు. జగనన్న ప్రభుత్వంలో అమ్మ ఒడి మొదలుకుని ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి కూడా బాలినేనికి స్థానిక మహిళలు వివరించి హర్షం వ్యక్తం చేశారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోనే తమ కుటుంబాలు పచ్చగా ఉన్నాయని, ఎంతో బాగుపడ్డాయని ఎమ్మెల్యే బాలినేనితో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలను బాలినేని చదివి వినిపించారు. ఇలాంటి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో మద్దతివ్వాలని కోరారు. స్థానిక మహిళలు బాలినేనికి హారతులు, పూలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ కుప్పం ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్‌ గంగాడ సుజాత, కమిషనర్‌ ఎం.వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, 5వ డివిజన్‌ కార్పొరేటర్‌ ఎందేటి పద్మావతి రంగారావు, ఒంగోలు ఏఎంసీ చైర్మన్‌ కొఠారి రామచంద్రరావు, 5వ డివిజన్‌ అధ్యక్షుడు సీహెచ్‌ సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌ సీపీ నాయకులు కఠారి శంకర్, బొమ్మినేని మురళి, ఆవుల సురేంద్ర, గొల్లపోలు కృష్ణ, జాజుల కృష్ణ, రావులపల్లి శ్రీకాంత్, కఠారి సురేష్, మిరియం సుబ్బులు, గఫూర్, దాసరి అమ్మన్న, మద్దసాని సుబ్బారావు, సైదా, మిరియం వెంకటేశ్వర్లు, కే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలే లక్ష్యం

- జిల్లాలో 27,450 మందికి లబ్ధి
- ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ శ్రీనివాసులు



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ శ్రీనివాసరావు, ఒడా చైర్‌పర్సన్‌ మీనావెంకట్రావు, టైలర్స్‌ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ సుభానీబీ, అధికారులు, లబ్ధిదారులు

ఒంగోలు అర్బన్‌: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లాలో తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ కె.శ్రీనివాసులు తెలిపారు. నవరత్నాలు–ద్వైవార్షిక నగదు మంజూరు కార్యక్రమంలో భాగంగా అర్హత ఉన్నప్పటికీ ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల ప్రయోజనం పొందలేని వారిని గుర్తించి పథకాలు అందిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ శ్రీనివాసులతో పాటు ట్రైనీ కలెక్టర్‌ శౌర్యపటేల్, మత్స్యశాఖ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సుమతి, ఒడా చైర్‌పర్సన్‌ మీనాకుమారి, ఏపీ టైలర్స్‌ డెవలప్‌మెంట్‌ కో ఆపరేటివ్‌ ఫెడరేషన్‌ చైర్మన్‌ షేక్‌ సుబానీబీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్‌ కలెక్టర్‌ మాట్లాడుతూ అర్హత ఉన్నప్పటికీ 2022 డిసెంబర్‌ నుంచి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందని వారిని గుర్తించి ఆయా పథకాల ద్వారా వారికి ప్రయోజనం కల్పించడంపై దృష్టి సారించామన్నారు. జిల్లాలో 27,450 మంది లబ్ధిదారులకు రూ.27,41,27,968 ఆర్థిక ప్రయోజనం దక్కిందన్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న చేదోడు, వైఎస్సార్‌ ఈబీసీ నేస్తం, వైఎస్సార్‌ మత్స్యకార భరోసా, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, రైతన్నలకు ఇన్‌పుట్‌ సబ్సిడీ, వైఎస్సార్‌ సున్నా వడ్డీ పంట రుణాలు, వైఎస్సార్‌ ఆసరా పథకాల్లో మిగిలిపోయిన అర్హులకు ఆర్థిక ప్రయోజనం కల్పించామన్నారు. ఈ పథకాల ద్వారా కలిగిన ఆర్థిక ప్రయోజనాన్ని మెరుగైన జీవనోపాధి కోసం వినియోగించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖాధికారి లక్ష్మానాయక్, బీసీ కార్పొరేషన్‌ ఈడీ వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ రవి కుమార్, జిల్లా బీసీ సంక్షేమ అధికారి అంజల, సచివాలయాల నోడల్‌ అధికారి ఉషారాణి, మత్స్యశాఖ ఏడీ ఉషాకిరణ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆగస్టు వివరాల ఆధారంగా ఉపాధ్యాయుల సర్దుబాటు

- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయండి
- జెడ్పీ స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ



సమావేశం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ సీఈవో జాలిరెడ్డి

ఒంగోలు: మిగులు ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించి జూన్‌ నెల విద్యార్థుల నమోదు ఆధారంగా కాకుండా ఆగస్టు నెల విద్యార్థుల నమోదు అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని డీఈవోను జిల్లా ప్రజా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ ఆదేశించారు. స్థానిక పాత జిల్లా పరిషత్‌ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన స్థాయీ సంఘాల సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఇటీవలే బదిలీలు కూడా జరిగినందున విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. నాగులుప్పలపాడు జెడ్పీటీసీ డాక్టర్‌ యాదాల రత్నభారతి మాట్లాడుతూ నాగులుప్పలపాడు మండలంలో ఖాళీగా ఉన్న టీచర్‌ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ఈదుమూడి పాఠశాలలో కిచెన్‌ ఏర్పాటు, ఉప్పుగుండూరు జెడ్పీ హైస్కూల్లో ఆటస్థలం అభివృద్ధి, మద్దిరాలపాడు జెడ్పీ హైస్కూల్లో మెట్ల రెయిలింగ్‌ వంటి సమస్యలను ప్రస్తావించారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని డీఈవో హామీ ఇచ్చారు. సాంఘిక సంక్షేమశాఖ అధికారులు కనీసం ప్రొటోకాల్‌ కూడా పాటించడం లేదంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ వివరణ ఇస్తూ.. మరోమారు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామన్నారు. ఇళ్లకు రాయితీ మంజూరులో పొరపాట్లు జరిగాయని, ఒకరికి బదులు మరొకరికి వచ్చాయని, వాటిని సరిచేయాలని త్రిపురాంతకం జెడ్పీటీసీ తెలిపారు. కనిగిరి జెడ్పీటీసీ మాట్లాడుతూ సొంత స్థలం ఉన్న వారు ఇళ్లు కట్టుకునేందుకు రాయితీ మంజూరు చేయాలని కోరగా, ప్రస్తుతం ఒంగోలు అర్బన్‌ డెవలప్‌మెంట్‌ పరిధిలో కనిగిరి లేదని, ముందు జగనన్న ఇళ్లు కట్టుకునే వారికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. చీమకుర్తి జెడ్పీటీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కోరారు. రైతులకు గ్రూప్‌గా ఇస్తున్న ట్రాక్టర్ల వినియోగంలో నిర్వహణ సరిగా ఉండటం లేదని, వాటిని పట్టించుకోవాలని పలువురు జెడ్పీటీసీలు కోరారు. అదే విధంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ పథకాలలో దొంగ మస్టర్ల గురించి ఫిర్యాదుచేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని డ్వామా పీడీ శీనారెడ్డి తెలిపారు. తిమ్మసముద్రం, నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈసీజీ కొరత ఉందని, గుండెపోటు మరణాలు తగ్గించాలంటే గోల్డెన్‌ అవర్‌లో అందించాల్సిన చికిత్సను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా అందించేందుకు ప్రకాశం జిల్లాలో పైలెట్‌ ప్రాజెక్టుగా నాగులుప్పలపాడు, తిమ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎంపికను పరిశీలించాలని కోరారు. దీనిపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ కమిషనర్‌ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామన్నారు. స్థాయీ సంఘాల సమావేశాలను జిల్లా ప్రజా పరిషత్‌ చైర్‌పర్సన్‌ బూచేపల్లి వెంకాయమ్మ, 3వ స్థాయీ సంఘ అధ్యక్షురాలు యన్నాబత్తిన అరుణ, 5వ స్థాయీ సంఘ కమిటీ అధ్యక్షురాలు మారెడ్డి అరుణ, 6వ కమిటీ అధ్యక్షురాలు చుండి సుజ్ఞానమ్మతో పాటు జెడ్పీ సీఈవో జాలిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.

ఎమ్మెల్యే బాలినేని ఆదేశాలతో పనులు ప్రారంభం

- ఒంగోలు జీజీహెచ్‌లో బాలినేని చెప్పిన మరుసటిరోజే ప్రారంభమైన పనులు

ఒంగోలు అర్బన్‌: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం స్థానిక జీజీహెచ్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అక్కడి వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ప్రమాదకరమైన చెట్లను తొలగించి అక్కడి నుంచి తరలించడం, పారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు మరి కొన్ని పనులను వెంటనే ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే నెలలో అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తామని, ప్రస్తుతం చెప్పిన పనులన్నీ జరిగాయో..లేదో ఆ సమావేశంలో చెప్పాలని అన్నారు. బాలినేని చెప్పిన మరుసటిరోజే గురువారం స్థానిక కార్పొరేటర్‌ ఈదర చిన్నారి ఆధ్వర్యంలో తొలగించిన చెట్లను తీసేవేసే కార్యక్రమం చేపట్టారు. పొక్లెయిన్, ట్రాక్టర్లతో ముమ్మరంగా పనులు చేశారు. అంతేగాకుండా పారిశుధ్యం మెరుగుపరిచేందుకు జీజీహెచ్‌ ఆవరణలో, మెడికల్‌ కాలేజీలో ఉన్న చెత్తను తీసివేసేందుకు చర్యలు చేపట్టారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు జీజీహెచ్, మెడికల్‌ కాలేజీల్లోని సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బాలినేని చెప్పిన మాట ప్రకారం వెంటనే పనులు ప్రారంభం కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



జీజీహెచ్‌ ఆవరణలో జరుగుతున్న చెట్ల తొలగింపు పనులు

క్లుప్తంగా

చదలవాడలో ఒంగోలు జాతి పశువులకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: ఒంగోలు జాతి పశువుల వేలంలో ఔత్సాహిక రైతులు పోటీ పడినట్లు చదలవాడ పశుక్షేత్రం ఉప సంచాలకులు రవి తెలిపారు. చదలవాడ పశుక్షేత్రంలో గురువారం నిర్వహించిన ఒంగోలు జాతి పశువుల వేలంలో మొత్తం 82 ఒంగోలు జాతి ఒట్టి ఆవులు, పాడి ఆవులు, పెయ్యలు, కోడె దూడలను ఉంచినట్లు ఆయన చెప్పారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 61 మంది ఔత్సాహిక రైతులు పాల్గొన్నారని, ఒక ఒంగోలు జాతి పెయ్య దూడను వేలంలో రూ.63 వేలకు ఓ రైతు దక్కించుకున్నారని వివరించారు. వేలం కమిటీ చైర్మన్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, కార్యనిర్వహణాధికారి డాక్టర్ కాలేషా, సభ్యులు డాక్టర్ రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు దేవశ్రీతన్వి



దేవశ్రీతన్విని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సింగరాయకొండ: కర్నూలులో సెప్టెంబర్ 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని అంకాల దేవశ్రీతన్వి ఎంపికైనట్లు హెచ్ఎం కె.మహాలక్ష్మి తెలిపారు. ప్రకాశం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఒంగోలులో నిర్వహించిన పోటీల్లో 10–12 ఏళ్ల విభాగంలో దేవశ్రీతన్వి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. దేవశ్రీతన్విని హెచ్ఎంతోపాటు పీడీ ఎల్.లావణ్య, వై.శ్రీదేవి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సాహస సైనికుల జీవితగాథలపై పోటీలు

ఒంగోలు: పాఠశాల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యరచన, మల్టీమీడియా అంశాల్లో, పాఠశాల, మండల, జిల్లా స్థాయిల్లో శౌర్య పురస్కారాలు పొందిన వీరుల జీవితగాథల ఆధారంగా ప్రాజెక్టులు నిర్వహించాలని డీఈఓ వీఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విజేతలకు విద్యాశాఖ, జాతీయ రక్షణ శాఖ ఆధ్వర్యంలో పురస్కారాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. 3 నుంచి 5 తరగతుల వరకు 150 పదాలతో పద్యం, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, 6 నుంచి 8 తరగతుల వరకు 300 పదాలతో వ్యాసం, పెయింటింగ్, డ్రాయింగ్ అండ్ మల్టీమీడియా, 9 నుంచి 10 తరగతుల వరకు 750 పదాలతో వ్యాసం, పెయింటింగ్, డ్రాయింగ్ అండ్ మల్టీమీడియా, 11–12 తరగతులకు వెయ్యి పదాలతో వ్యాసం, పెయింటింగ్, డ్రాయింగ్ అండ్ మల్టీమీడియాలో పోటీలు నిర్వహించాలన్నారు. ఈ నెల 31వ తేదీలోగా పోటీలు నిర్వహించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో నలుగురు విజేతలు, జిల్లా స్థాయిలో 8 మంది, రాష్ట్ర స్థాయిలో 100 మంది విజేతలను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వీర గాథ 3.0 ప్రాజెక్టు బ్యానర్‌ను ప్రతి పాఠశాలలో ఏర్పాటుచేసి కార్యక్రమ నిర్వహణ ఫొటోలు, వీడియోలను ఏక్‌భారత్ ఆన్‌లైన్ అనే జీమెయిల్‌కు లేదా ఏపీఎస్ఎస్ఏప్రకాశం అనే జీమెయిల్‌కు పంపాలని తెలిపారు. పోటీలను పర్యవేక్షించాలని ఎంఈఓలకు సూచించారు.

రేపు పీఎఫ్ కార్యాలయంలో పలువురికి సత్కారం

ఒంగోలు: ప్రకాశం జిల్లా పరిధిలోని వివిధ సంస్థలు తమ కంపెనీల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల ఈ నామినేషన్ ప్రక్రియ నూరు శాతం పూర్తి చేసినందుకు ఈ నెల 25న సత్కరించడంతోపాటు ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.సమ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక పీడీసీసీ బ్యాంకు సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశంస పత్రాలను రీజినల్ పీఎఫ్ కమిషనర్ రాజేశ్వర్ రాజీవ్, సహాయ పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ అందిస్తారని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 16 సంస్థల యజమానులకు ప్రశంస పత్రాలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

అయ్యయ్యో.. వద్దమ్మా..!



- బాల్య వివాహాల కట్టడిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- బాలికలకు 18 ఏళ్లు నిండితేనే వివాహం చేసేలా ప్రత్యేక చర్యలు
- ముందే పెళ్లి చేస్తే ప్రభుత్వ పథకాలు నిలిపేసేలా అధికారులకు ఆదేశాలు
- జిల్లాలో ఇప్పటి వరకు 77 వివాహాలు నిలిపివేత ● 4 కేసులు నమోదు

దర్శి: అవగాహనా రాహిత్యంతో చేస్తున్న బాల్యవివాహాలు వారి జీవితాలను చిదిమేస్తున్నాయి. చిన్న వయసులో గర్భం దాల్చి తల్లీబిడ్డల ఆరోగ్యాలు క్షీణిస్తున్నాయి. ఆ తరువాత పనులు చేయడానికి ఒంట్లో ఓపిక లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే బాల్య వివాహాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్రంలో బాల్యవివాహాల నియంత్రణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వ పథకాలు కూడా రద్దు చేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. వివాహాల నియంత్రణలో విఫలమైన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరిస్తున్నారు. బాల్య వివాహాలకు సంబంధించి ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజెస్ రూల్స్ 2012, 2023కు సంబంధించిన నియమాలు కట్టుదిట్టం చేయాలని అధికారులు సన్నద్ధమయ్యారు. అందుకు సంభందించి మహిళా శిశు సంక్షేమం, సెర్ప్, విద్య, వైద్య, ఆరోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారు. దేవాలయాల్లో వివాహాలు జరిపే పూరోహితులు, అలాగే పాస్టర్లు, ఖాజీలు, దేవదాయ శాఖ ఈఓలు, కళ్యాణ మండపాల ఇన్‌చార్జ్‌లకు బాల్య వివాహాల కట్టడిపై తగిన ఆదేశాలు కూడా జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు జిల్లా బాలుర సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో 77 బాల్య వివాహాలు నిలిపివేశారు. చెప్పినా వినకుండా బాల్య వివాహాలు చేసుకున్న వారిపై నాలుగు కేసులు నమోదు చేశారు. అలాంటి బాలికలను స్వచ్ఛంద సంస్థలు లేదా బాల సదన్‌లో ఉంచి 18 ఏళ్లు నిండిన తరువాత తల్లిదండ్రులకు అప్పజెప్పేలా చర్యలు చేపట్టారు.

బాల్య వివాహాలతో సమస్యలే..

చిన్న వయసులోనే తల్లిగా మారితే పుట్టిన బిడ్డకు, తల్లికి ప్రమాదాలు ఎదురౌతాయి. బాలికలు తమ ఆరోగ్యం, పోషణ, విద్య, ప్రాథమిక హక్కులు కోల్పోవడమే కాకుండా గృహ హింస, దోపిడీకి గురవుతారు. పిల్లలు అంగవైకల్యంతో పుట్టే ఆస్కారం ఉంది. తల్లిలో రక్తహీనత ఏర్పడి అనారోగ్యంపాలవుతారు. వెన్నెముక మెతక బారుతుంది. అరక్షిత లైంగిక చర్యలకు గురై ఆమె ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. అవగాహన లేక ఆలోచనా శక్తి చాలక వారి ఎదుగుదల క్షీణిస్తుంది.



బాల్య వివాహంపై అవగాహన కల్పిస్తున్న డీసీపీఓ దినేష్

నియంత్రణలో ఎవరిపాత్ర ఎంత?

పోలీసులు

బాల్య వివాహాలకు సంబంధించి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపడతారు. నియమిత దర్యాప్తు అధికారితో కలిసి లేదా తామంతట తామే వెంటనే వివాహం జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి తగిన చర్యలు తీసుకుంటారు. బాల్య వివాహం జరుగుతున్న ప్రాంతంలో వివాహం జరిపించే పురోహితులు, ఇతర మధ్యవర్తులు, పెద్దలందరినీ అరెస్ట్ చేస్తారు. వధూవరులకు అవగాహన కల్పించి వివాహాలు నిలుపుదల చేస్తారు.

ఇరుగు పొరుగువారు

బాల్యవివాహాల సమాచారం అందగానే ఆ కుటుంబంలో తల్లిదండ్రులు, బంధువులు లేదా గ్రామస్తులతో మాట్లాడి బాల్య వివాహాలు జరగకుండా వారిని ఒప్పించాలి. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలు వారికి వివరించాలి. వివాహం ఆపలేని సందర్భంలో వెంటనే చైల్డ్ లైన్–1098 , స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి.

ఉపాధ్యాయులు

బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివిధ పద్ధతుల్లో చర్చలు నిర్వహించాలి. పోలీసులు, బాల్య వివాహ నిరోధక అధికారులను ఆహ్వానించి వారితో మాట్లాడించాలి. బాల్య వివాహాలకు గురయ్యే విద్యార్థులను రోజువారీ హాజరు పట్టీ ద్వారా గమనిస్తూ సమాచారాలు సేకరించాలి. తరచూ పాఠశాలలకు రాకుండా మానివేస్తున్న బాలికలను గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి కారణాలు తెలుసుకోవాలి. అనర్థాలను వారి కుటుంబ సభ్యులకు వివరించాలి.

గ్రామ పంచాయతీ

గ్రామ విద్యా కమిటీ ద్వారా పాఠశాలలో చేరిన విద్యార్థులు, బడి మానేస్తున్న బాలికల వివరాలు సేకరించాలి. గ్రామంలో బాల రక్షణ కమిటీలు ఏర్పాటు చేసి బాల్య వివాహాలు వంటి ఘటనలు జరగకుండా పర్యవేక్షించాలి. బాల్య వివాహాల్లో పాల్గొనడం, ప్రోత్సహించడం చేయరాదు.

ఉసురు తీసిన కుటుంబ కలహాలు

- వేర్వేరు చోట్ల ఉరేసుకుని ఇద్దరు మృతి

దొనకొండ: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటన దొనకొండ మండలంలోని కొచ్చెర్లకోట ఎస్సీ కాలనీలో గురువారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై సైదుబాబు కథనం మేరకు వివరాలు.. కొచ్చెర్లకోట ఎస్సీ కాలనీకి చెందిన వినుకొండ నాగరాజు(32) కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో కొంతకాలంగా బాధపడుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పిల్లలకు దిక్కెవరంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి గాలెయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొమరోలు మండలంలో వివాహిత..

కొమరోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొమరోలు మండలంలోని బెడుసుపల్లె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వైఎస్సార్ జిల్లా కలశపాడు మండలం రామాపురం గ్రామానికి చెందిన చంద్రకళ(33)కు 15 ఏళ్ల క్రితం కొమరోలు మండలంలోని బెడుసుపల్లె గ్రామానికి చెందిన గుర్రప్పతో వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చంద్రకళ గురువారం ఇంట్లో ఉన్న సమయంలో పక్కింటి వారు తలుపు తట్టగా ఎంతసేపటికీ తీయకపోవడంతో పొలం పనికి వెళ్లిన ఆమె అత్తకు సమాచారం ఇచ్చారు. చుట్టుపక్కల వారు కిటికీలు తెరిచి చూడగా చంద్రకళ ఉరికి వేలాడుతూ కనిపించింది. దీంతో తలుపులు బద్దలుకొట్టి పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్సై సుబ్బరాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.



చంద్రకళ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

- పోక్సో చట్టం కింద కేసు నమోదు
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ రామచంద్ర



మాట్లాడుతున్న డీఎస్పీ రామచంద్ర

కందుకూరు : బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడు మస్తాన్ వలిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రామచంద్ర తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. లైంగిక దాడికి గురైన చిన్నారి గత రెండేళ్ల నుంచి కోటకట్ట వీధిలోని అమ్మమ్మ వద్ద ఉంటూ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 2వ తరగతి చదువుతుంది. ఈ క్రమంలో ఇంటి పక్కనే ఉండే మస్తాన్‌వలి అనే వ్యక్తి బుధవారం సాయంత్రం బాలికకు చాక్లెట్‌లు ఇస్తానని చెప్పి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. చిన్నారి పొట్టలో నొప్పి అని అమ్మమ్మకు చెప్పడంతో పరిశీలించి చూడగా, రక్తపు మరకలు ఉండటంతో అనుమానం వచ్చి ఏమైందని చిన్నారిని ప్రశ్నించడంతో జరిగిన సంఘటన గురించి చెప్పింది. తరువాత చిన్నారి బంధువులు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి పోక్సో చట్టం కింద నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు నిందితున్ని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. సీఐ నఫీజ్‌భాష, పట్టణ ఎస్సై హనీఫ్ పాల్గొన్నారు.



మార్కాపురంలో 300 అడుగుల జాతీయ జెండాతో జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రదర్శన

శభాష్ ఇస్రో..




చంద్రయాన్ నమూనాలో కమలా కాన్వెస్ట్ స్కూల్ విద్యార్థులు

మార్కాపురం/మార్కాపురం టౌన్: చంద్రయాన్–3 మిషన్ విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు హెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి, పీడీ జాహ్నవి ఆధ్వర్యంలో 300 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే కమలా కాన్వెస్ట్ స్కూల్లో ప్రిన్సిపాల్ ఎంవీ పుల్లయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు చంద్రయాన్–3 రాకెట్ నమూనాలో కూర్చుని 300 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శించారు. ప్రపంచానికి దేశ ఔన్నత్యాన్ని చాటిన శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం

కారంచేడు: కొమ్మమూరు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. గురువారం మండలంలోని కారంచేడు–స్వర్ణ గ్రామాల మధ్యన గుర్తు పట్టడానికి కూడా వీలులేని విధంగా మృతదేహం ఉన్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కారంచేడు ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలం వద్దకు వెళ్లి నీటిలో ఉన్న మృతదేహాన్ని అతికష్టం మీద బయటకు తీయించారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు.. మృతుడి వయసు సుమారు 45–50 ఏళ్లు ఉంటుంది. ఎగువ ప్రాంతంలో కాలు జారి పడిపోవడం లేదా ఆత్మహత్య చేసుకోవడం లేదా ఎవరైనా చంపి కాలువలో పడేయడమో చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగి సుమారు వారం అయ్యి ఉంటుందని బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించామన్నారు. అనుమానాస్పద కేసుగా నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

స్కూటీ అదుపుతప్పి యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన వెంకటేష్‌కు సపర్యలు చేస్తున్న భార్గవి

జరుగుమల్లి: స్కూటీపై అదుపు తప్పడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలు కాగా మరో యువతి స్వల్ప గాయాలతో బయటపడింది. ఈ సంఘటన జరుగుమల్లి సమీపంలోని వాటర్ ప్లాంట్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జరుగుమల్లి మండలంలోని నర్సింగోలు గ్రామం నుంచి స్కూటీపై వెంకటేష్, భార్గవి టంగుటూరు వైపు వస్తున్నారు. ఈ క్రమంలో వీరి వాహనం జరుగుమల్లి సమీపంలోని అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోయారు. దీంతో వెంకటేష్ తీవ్రంగా, భార్గవి స్వల్పంగా గాయపడ్డాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో ఒంగోలులోని జీజీహెచ్‌కు తరలించారు. భార్గవి స్వగ్రామం నర్సింగోలు కాగా, వెంకటేష్‌ది ఉప్పుగుండూరు అని 108 సిబ్బంది తెలిపారు.

మార్కాపురం మెడికల్ కాలేజ్‌కు
పోస్టుల మంజూరుపై హర్షం

- సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కృతజ్ఞతలు



మార్కాపురం: మార్కాపురంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కళాశాల ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మార్కాపురం, మదనపల్లి వైద్య కళాశాలల్లో 1412 పోస్టులను మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేయడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, అందులో భాగంగానే మార్కాపురానికి మెడికల్ కళాశాల మంజూరు చేయడంతోపాటు 2024–2025 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు.

వివాహానికి రెండ్రోజుల ముందు...



అంబులెన్స్‌లో హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



వైద్యం వికటించి మృతిచెందిన హారిక

- వైద్యం వికటించి యువతి మృతి
- డాక్టర్ అవతారమెత్తిన మెడికల్ షాపు యజమానే కారణమని ఆరోపణలు

మార్టూరు: వివాహానికి రెండ్రోజుల ముందు వైద్యం వికటించి ఓ యువతి మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని కోలలపూడి గ్రామంలో గురువారం జరిగింది. ఓ మెడికల్ షాపు యజమాని వైద్యుడి అవతారమెత్తి యువతికి చేసిన వైద్యం వికటించి మృతిచెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి... బాపట్ల జిల్లా జే పంగులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన బెల్లంకొండ గోపమ్మ, గాలయ్య దంపతుల కుమార్తె హారిక (19)కు ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన యువకుడితో ఈ నెల 26వ తేదీ శనివారం రాత్రి వివాహం చేసేందుకు పెద్దలు నిశ్చయించారు. ఈ క్రమంలో హారిక తనకు నీరసంగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో గురువారం ఉదయం కోలలపూడి గ్రామంలో ఉన్న హారిక మేనమామలు వైద్యం చేయిస్తామని వారి గ్రామం పిలిపించారు. ఆ గ్రామంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్న సాదినేని వెంకటేశ్వరరావు అనే యువకుడు అదే గ్రామానికి చెందిన ఓ యువతి సహాయంతో తన మెడికల్ షాపు పక్కనే వైద్యం చేస్తున్నాడు. ఒంట్లో నలతగా ఉన్న హారికను వెంకటేశ్వరరావు వద్దకు బంధువులు పంపించడంతో మొదట ఒక సెలైన్ ఎక్కించారు. రెండో సెలైన్ ఎక్కించే క్రమంలో సెలైన్ బాటిల్‌లో వెంకటేశ్వరరావు ఓ ఇంజక్షన్ చేశాడు. ఆ తర్వాత కొంతసేపటికి ఆమె ఫిట్స్‌తో కొట్టుకుంటుండటంతో బంధువులు కారులో మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో అక్కడి నుంచి చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా హారిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ హారికను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మరణించినట్లు చెప్పడంతో మృతదేహాన్ని గురువారం రాత్రి స్వగ్రామం ముప్పవరం తరలించారు. తెలిసీతెలియని వైద్యంతో రెండు రోజుల్లో పెళ్లిపీటలపై కూర్చోవాల్సిన హారికను శ్మశానానికి పంపారంటూ కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా.. పోయిన ప్రాణం ఎలాగో పోయింది.. తిరిగి రాదు కదా... అంటూ మధ్యవర్తులు హారిక మృతి విషయం బయటకు పొక్కకుండా రాజీ ప్రయత్నాలు ప్రారంభించడం గమనార్హం.





తెలుగు సినిమా... ఎత్తర జెండా

అల్లు అర్జున్... ఉత్తమ నటుడు

హోల్‌సమ్ ఎంటర్‌టైనర్ ఆర్‌ఆర్‌ఆర్

- తెలుగు సినిమాకి పది అవార్డులు
- 'ఆర్‌ఆర్‌ఆర్'కు ఆరు అవార్డులు
- ఉత్తమ నటీమణులుగా ఆలియా భట్, కృతీ సనన్
- ఉత్తమ చిత్రంగా 'రాకెట్రీ ది నంబి ఎఫెక్ట్'
- ఉత్తమ దర్శకుడు నిఖిల్ మహాజన్

జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తొలిసారి తెలుగు సినిమాలు దుమ్ము రేపాయి. మొత్తం పది అవార్డులతో 'ఎత్తర జెండా' అంటూ తెలుగు సినిమా సత్తా చాటింది. 69 ఏళ్ల జాతీయ అవార్డుల చరిత్రలో తెలుగు నుంచి జాతీయ ఉత్తమ నటుడిగా 'పుష్ప... ఫైర్' అంటూ అల్లు అర్జున్ రికార్డ్ సాధించారు. ఆస్కార్ అవార్డుతో చరిత్ర సృష్టించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఆరు అవార్డులతో సిక్సర్ కొట్టింది. వీటిలో 'హోల్‌సమ్ ఎంటర్‌టైనర్' అవార్డు 'ఆర్‌ఆర్‌ఆర్' సొంతం అయింది. 2021 జనవరి 1 నుంచి 2021 డిసెంబరు 31 లోపు సెన్సార్ అయి, అవార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న సినిమాలను పరిగణనలోకి తీసుకుని జ్యూరీ సభ్యులు అవార్డులను ప్రకటించడం జరిగింది. జాతీయ ఉత్తమ నటీమణులుగా 'గంగూబాయి కతియావాడి'లో వేశ్య పాత్ర చేసిన ఆలియా భట్, 'మిమి' చిత్రంలో గర్భవతిగా నటించిన కృతీ సనన్ నిలిచారు. ఖగోళ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఆర్. మాధవన్ టైటిల్ రోల్ చేసి, స్వీయదర్శకత్వంలో రూపొందించిన 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' ఉత్తమ చిత్రంగా, ఉత్తమ దర్శకుడిగా మరాఠీ ఫిల్మ్ 'గోదావరి'కి గాను నిఖిల్ మహాజన్ అవార్డు సాధించారు. ఇంకా పలు విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం గురువారం జాతీయ అవార్డులను ప్రకటించింది. ఆ విశేషాలు ఈ విధంగా...

69వ జాతీయ అవార్డులకు గాను 28 భాషలకు చెందిన 280 చలన చిత్రాలు పోటీపడ్డాయి. మొత్తం 31 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. సుకుమార్ దర్శకత్వంలోని 'పుష్ప: ది రైజ్' సినిమాలోని నటనకు గాను అల్లు అర్జున్‌కు ఉత్తమ జాతీయ నటుడిగా తొలి అవార్డు లభించింది. ఇదే చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవిశ్రీ ప్రసాద్ జాతీయ అవార్డు సాధించారు. ఇక ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'రౌద్రం..రణం..రుధిరం' (ఆర్‌ఆర్‌ఆర్) సినిమాకు ఆరు విభాగాల్లో అవార్డులు దక్కాయి. జాతీయ హోల్‌సమ్ ఎంటర్‌టైనర్‌గా 'ఆర్‌ఆర్‌ఆర్' నిలిచింది. ఇదే చిత్రానికి ఉత్తమ నేపథ్య సంగీతానికి గాను ఎంఎం కీరవాణి, ఇదే చిత్రానికి స్పెషల్ ఎఫెక్ట్స్‌కి వి. శ్రీనివాస్ మోహనన్, 'నాటు నాటు..' పాట కొరియోగ్రఫీకి ప్రేమ్ రక్షిత్, 'ఆర్ ఆర్ఆర్'లోని 'కొమురం భీముడో..' పాటకు మేల్ ప్లే బ్యాక్ సింగర్‌గా కాలభైరవ, ఇదే చిత్రానికి స్టంట్ కొరియోగ్రాఫర్‌గా కింగ్ సాల్మన్‌లకు జాతీయ అవార్డులు దక్కాయి. ఇక 'నాటు నాటు'కి రచయితగా తొలి ఆస్కార్ అవార్డు అందుకున్న చంద్రబోస్ 'కొండపొలం'లోని 'ధంధం ధం.. తిరిగేద్దాం...' పాటకు జాతీయ అవార్డు అందుకోనున్నారు. దర్శకుడిగా తన తొలి చిత్రానికి జాతీయ అవార్డు దక్కిన ఆనందంలో ఉన్నారు 'ఉప్పెన'ను తెరకెక్కించిన బుచ్చిబాబు సన. మైత్రీ మూవీ మేకర్స్‌పై వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన 'ఉప్పెన' ప్రాంతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నిలిచింది. ఉత్తమ సినీ విమర్శకుడిగా నల్గొండ జిల్లాకి చెందిన ఎం. పురుషోత్తమాచార్యులకు అవార్డు దక్కింది. రెండేళ్లుగా 'మిసిమి' మాస పత్రికలో సినిమా పాటల్లో శాస్త్రీయ సంగీతంపై పరిశోధనలు చేస్తూ, పలు వ్యాసాలు రాశారు పురుషోత్తమాచార్యులు. ఇక ఆలియా భట్‌కి 'గంగూబాయి కతియావాడి' జాతీయ ఉత్తమ నటిగా అవార్డు దక్కేలా చేయడంతో పాటు మరో నాలుగు విభాగాల్లో (బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్, మేకప్, ఎడిటింగ్) అవార్డులు వచ్చేలా చేసింది. అలాగే విక్కీ కౌశల్ హీరోగా నటించిన బయోగ్రాఫికల్ డ్రామా 'సర్దార్ ఉద్దమ్'కు ప్రాంతీయ ఉత్తమ హిందీ చిత్రంతో పాటు మొత్తం నాలుగు విభాగాల్లో (సినిమాటోగ్రఫీ, ఆడియోగ్రఫీ, ప్రొడక్షన్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్) అవార్డులు దక్కాయి. ఈ చిత్రానికి సూజిత్ సర్కార్ దర్శకుడు. తమిళ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కడైసీ వివసాయి', మలయాళంలో 'హోమ్', కన్నడంలో '777 చార్లీ' అవార్డులు గెలుచుకున్నాయి. ఇంకా పలు భాషల్లో పలు చిత్రాలకు అవార్డులు దక్కాయి.


● విక్కీ కౌశల్ (సర్దార్ ఉద్ధమ్)


● ఆలియా భట్ (గంగూబాయి కతియావాడి)


● కృతీసనన్ (మిమీ)

'పుష్ప' చిత్రంలో నటనకుగాను అల్లు అర్జున్‌కి జాతీయ ఉత్తమ నటుడు అవార్డు దక్కడం సంతోషం. తొలిసారి ఈ అవార్డు అందుకోనున్న అల్లు అర్జున్‌కి అభినందనలు. 69వ జాతీయ అవార్డులు తెలుగు చిత్ర పరిశ్రమకు బొనాంజాగా నిలిచాయి. అదే విధంగా పాన్ ఇండియా కాన్వాస్‌లో దూసుకుపోతున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు విభాగాల్లో ఈ అవార్డులు దక్కటం ప్రశంసనీయం. డైరెక్టర్ రాజమౌళితో పాటు చిత్ర యూనిట్‌కి అభినందనలు. ఉత్తమ సంగీత దర్శకునిగా దేవీశ్రీ ప్రసాద్ (పుష్ప), ఉత్తమ సాహిత్యానికి చంద్రబోస్ (కొండపొలం) జాతీయ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం.
- వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

★★★

తెలుగు సినిమా గర్వపడే క్షణాలివి. జాతీయ ఉత్తమ నటుడిగా నిలిచిన బన్నీ (అల్లు అర్జున్)కి శుభాకాంక్షలు. చాలా గర్వంగా ఉంది. రాజమౌళి విజన్‌లో ఆరు అవార్డులు సాధించిన 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు, రెండు అవార్డులు సాధించిన 'పుష్ప'కు, 'ఉప్పెన' టీమ్‌కు, సినీ విమర్శకులు పురుషోత్తమచార్యులకు శుభాకాంక్షలు. **- చిరంజీవి**

★★★

ఇట్స్ సిక్సర్.. జాతీయ అవార్డులు సాధించినందుకు 'ఆర్‌ఆర్‌ఆర్' యూనిట్ అందరికీ శుభాకాంక్షలు. ఎంపిక చేసిన జ్యూరీకి ధన్యవాదాలు. 'పుష్ప'.. తగ్గేదేలే... బన్నీకి, దేవిశ్రీ ప్రసాద్‌లతో పాటు 'పుష్ప' టీమ్‌కి శుభాకాంక్షలు. బోస్ (చంద్రబోస్) గారికి మళ్లీ శుభాకాంక్షలు. 'గంగూబాయి కతియావాడి'తో అవార్డు గెల్చుకున్న మా 'సీత' ('ఆర్‌ఆర్‌ఆర్'లో ఆలియా భట్ సీత పాత్రలో నటించారు)కు కంగ్రాట్స్. 'ఉప్పెన' టీమ్‌తో పాటు జాతీయ స్థాయిలో అవార్డులు గెల్చుకున్నవారికీ శుభాకాంక్షలు.
- రాజమౌళి

★★★

నా నేపథ్య సంగీతాన్ని గుర్తించి, నాకు జ్యూరీ సభ్యులు అవార్డును ప్రకటించడాన్ని గౌరవంగా భావిస్తున్నాను . చంద్రబోస్‌గారికి, దేవిశ్రీ ప్రసాద్, కాలభైరవ.. మా 'ఆర్‌ఆర్‌ఆర్' టీమ్‌కు శుభాకాంక్షలు. **- కీరవాణి**

★★★

ఈ జాతీయ అవార్డు మీదే (సంజయ్ సార్, గంగూబాయి.. టీమ్.. ముఖ్యంగా ప్రేక్షకులు). ఎందుకంటే... మీరు లేకుంటే నాకు ఈ అవార్డు దక్కేదే కాదు. చాలా సంతోషంగా ఉంది. ఈ క్షణాలను గుర్తుపెట్టుకుంటాను. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసేందుకు ఇంకా కష్టపడతాను. 'మిమి' సినిమాలో నీ (కృతీ సనన్‌ని ఉద్దేశించి) నటన నిజాయితీగా, పవర్‌ఫుల్‌గా ఉంది. ఆ సినిమా చూసి నేను ఏడ్చాను. ఉత్తమ నటి అవార్డుకు నువ్వు అర్హురాలివి. **- ఆలియా భట్.**

★★★

69 సంవత్సరాలుగా తెలుగు ఇండస్ట్రీకి రాని ఆ అద్భుతాన్ని తీసుకొచ్చిన ప్రేక్షకులకు, నిర్మాతలకు, దర్శకుడికి, ముఖ్యంగా మా ఫ్యామిలీని పతాకస్థాయికి తీసుకుని వెళ్లిన మా అబ్బాయికి (అల్లు అర్జున్) కృతజ్ఞతలు. **- అల్లు అరవింద్**

ఇంకా వెంకటేశ్, మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్ తదితరులు తమ ఆనందం వ్యక్తం చేశారు.

ఆర్‌ఆర్‌ఆర్ సిక్సర్


● కీరవాణి ● శ్రీనివాస్ మోహనన్ ● కాలభైరవ ● ప్రేమ్ రక్షిత్ ● కింగ్ సాల్మన్


● దేవిశ్రీ ప్రసాద్ ● చంద్రబోస్ ● పురుషోత్తమాచార్యులు ● బుచ్చిబాబు


● కేక్ కట్ చేస్తున్న అల్లు అర్జున్‌తో కుటుంబ సభ్యులు, 'పుష్ప' టీమ్

మా మైత్రీ మూవీస్ బ్యానర్‌లో 'ఉప్పెన, పుష్ప' చాలా ప్రతిష్ఠాత్మక చిత్రాలు. జాతీయ అవార్డు అందుకున్న తొలి తెలుగు నటుడిగా అల్లు అర్జున్‌గారు చరిత్ర సృష్టించారు. తెలుగు సినిమా చరిత్రలో ఇది చిరకాలం గుర్తుండిపోతుంది. దేవిశ్రీ ప్రసాద్‌కి అవార్డు రావడం ఆనందంగా ఉంది. 'ఉప్పెన, పుష్ప' రెండు విజయాల్లో సింహ భాగం సుకుమార్‌గారిదే. 'ఆర్ ఆర్ఆర్, కొండపొలం' చిత్రాలకు జాతీయ అవార్డులు రావడం ఆనందాన్నిచ్చింది.
- వై. రవిశంకర్, నిర్మాత

ఇదొక చరిత్ర
- నవీన్ యెర్నేని, వై. రవిశంకర్

అల్లు అర్జున్‌గారికి జాతీయ అవార్డు రావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉంది. ఇదొక చరిత్ర 'పుష్ప' షూటింగ్ సమయంలోనే అల్లు అర్జున్ తప్పకుండా నేషనల్ అవార్డ్ కొడతారని సుకుమార్‌గారు అనేవారు.. అది ఈ రోజు నిజమైంది. మాకు ఇంత మంచి సినిమా ఇచ్చిన అల్లు అర్జున్, సుకుమార్ గార్లకు థ్యాంక్స్. దేవిశ్రీ ప్రసాద్‌కి జాతీయ అవార్డ్ రావడం హ్యాపీ. అలాగే మా 'ఉప్పెన'కి ఉత్తమ తెలుగు సినిమాగా జాతీయ అవార్డు రావడం గర్వంగా ఉంది. దర్శకుడు బుచ్చిబాబు, టీమ్‌కి అభినందనలు. అలాగే 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రానికి ఆరు అవార్డులు రావడం సంతోషంగా ఉంది.
- నవీన్ యెర్నేని, నిర్మాత

''నా తొలి సినిమాకే జాతీయ అవార్డు రావడం హ్యాపీగా ఉంది. నిర్మాతలు నవీన్‌గారికి, రవిగారికి, మా గురువుగారు సుకుమార్ గారికి కృతజ్ఞతలు. సినిమా చూడ్డానికి మా ఇంట్లో నన్ను పంపించేవాళ్లు కాదు. అలాంటిది నేను ఒక సినిమాకి డైరెక్ట్ చేయడం, నా ఫస్ట్ సినిమాకే నేషనల్ అవార్డు రావడం అంటే ఏం మాట్లాడాలో అర్థం కావడంలేదు. మా అమ్మగారికి నేషనల్ అవార్డు అంటే ఏంటో కూడా తెలియదు. ఈ అవార్డు గురించి ఆమెకి చెప్పాలంటే. 'ఇండియాలోనే పెద్ద అవార్డు వచ్చింది' అని చెప్పాలి'' అంటున్న బుచ్చిబాబు సనని తదుపరి చిత్రం గురించి అడగ్గా.. ''రామ్ చరణ్‌గారి కోసం మంచి రా అండ్ రస్టిక్ స్టోరీ రాశాను. నా మనసుకి బాగా నచ్చి, రాసుకున్న కథ ఇది. జనవరిలో షూటింగ్ ఆరంభిస్తాం'' అన్నారు.
- బుచ్చిబాబు సన, దర్శకుడు

69వ చలనచిత్ర జాతీయ అవార్డు విజేతలు

ఉత్తమ నటుడు: అల్లు అర్జున్ (పుష్ప)
ఉత్తమ నటి: ఆలియా భట్ (గంగూబాయి..) - కృతీసనన్ (మిమీ)
ఉత్తమ చిత్రం: రాకెట్రీ: ద నంబి ఎఫెక్ట్ (హిందీ)
ఉత్తమ దర్శకుడు: నిఖిల్ మహాజన్ (గోదావరి- మరాఠీ సినిమా)
ఉత్తమ పిల్లల చిత్రం: గాంధీ అండ్ కో (గుజరాతీ)
ఉత్తమ మ్యూజిక్ డైరెక్టర్ (నేపథ్య సంగీతం): ఆర్‌ఆర్‌ఆర్ - ఎమ్ఎమ్ కీరవాణి
ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): పుష్ప- దేవిశ్రీ ప్రసాద్
ఉత్తమ కొరియోగ్రఫీ: ఆర్‌ఆర్‌ఆర్ -ప్రేమ్ రక్షిత్
ఉత్తమ మేల్ ప్లేబ్యాక్ సింగర్: కాలభైరవ (ఆర్‌ఆర్‌ఆర్ - కొమురం భీముడో..)
ఉత్తమ లిరిక్స్: చంద్రబోస్- కొండపొలం
ఉత్తమ యాక్షన్ డైరెక్షన్ అవార్డ్ (స్టంట్ కొరియోగ్రఫీ): ఆర్‌ఆర్‌ఆర్- కింగ్ సాల్మన్
ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్: ఆర్‌ఆర్‌ఆర్- శ్రీనివాస్ మోహనన్
ఉత్తమ సహాయ నటి: పల్లవీ జోషి (ద కశ్మీరీ ఫైల్స్- హిందీ)
ఉత్తమ సహాయ నటుడు: పంకజ్ త్రిపాఠీ (మిమీ- హిందీ)
ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్: ప్రీతిశీల్ సింగ్ డిసౌజా (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఫీమేల్ ప్లేబ్యాక్ సింగర్: శ్రేయా ఘోషల్ (ఇరవిన్ నిళల్- తమిళ్)
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: వీరా కపూర్ ఏ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ది మిత్రీ మాలిక్ - మాన్సి ధ్రువ్ మెహతా (సర్దార్ ఉద్ధమ్) (హిందీ)
ఉత్తమ ఎడిటింగ్: సంజయ్ లీలా భన్సాలీ (గంగూబాయి కతియావాడి-హిందీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (లొకేషన్ సౌండ్ రికార్డిస్ట్): అరుణ్ అశోక్ - సోనూ కేపీ (చవిట్టు మూవీ-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే(అడాప్టెడ్): సంజయ్‌లీలా భన్సాలీ, ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): షాహీ కబీర్ (నాయట్టు సినిమా-మలయాళం)
ఉత్తమ స్క్రీన్‌ప్లే (డైలాగ్ రైటర్): ప్రకాశ్ కపాడియా - ఉత్కర్షిణి వశిష్ట (గంగూబాయి కతియావాడి- హిందీ)
ఉత్తమ సినిమాటోగ్రఫీ: అవిక్ ముఖోపాధ్యాయ్ (సర్దార్ ఉద్ధమ్ మూవీ-హిందీ)
ఉత్తమ చైల్డ్ ఆర్టిస్ట్: భవిన్ రబరీ (ఛెల్లో షో - గుజరాతీ)
ఉత్తమ ఫిలిం ఆన్ ఎన్విరాన్‌మెంట్ కన్‌జర్వేషన్: అవషావ్యూహం (మలయాళం)
ఉత్తమ ఫిలిం ఆన్ సోషల్ ఇష్యూస్: అనునాద్-ద రెజోనెన్స్ (అస్సామీ)
ఉత్తమ పాపులర్ ఫిలిం ఆన్ ప్రొవైడింగ్
హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్: ఆర్‌ఆర్‌ఆర్
ఉత్తమ ఆడియోగ్రఫీ (సౌండ్ డిజైనర్): అనీష్ బసు (జీలీ మూవీ- బెంగాలీ)
ఉత్తమ ఆడియోగ్రఫీ (రీ రికార్డిస్ట్ ఆఫ్ ద ఫైనల్ మిక్స్‌డ్ ట్రాక్): సినోయ్ జోసెఫ్ (సర్దార్ ఉద్ధమ్-హిందీ)
ఇందిరాగాంధీ అవార్డ్ ఫర్ బెస్ట్ డెబ్యూ ఫిలిం ఆఫ్ ఎ డైరెక్టర్: మెప్పాడియన్ (మలయాళం)
స్పెషల్ జ్యూరీ అవార్డ్: షేర్ షా (హిందీ) (డైరెక్టర్ విష్ణువర్ధన్)
నర్గీస్ దత్ అవార్డ్ ఫర్ బెస్ట్ ఫిల్మ్ ఆన్ నేషనల్ ఇంటిగ్రేషన్: ద కశ్మీరీ ఫైల్స్ (హిందీ)

ఉత్తమ ప్రాంతీయ చిత్రాలు

ఉత్తమ తెలుగు చిత్రం	: ఉప్పెన
ఉత్తమ తమిళ్ చిత్రం	: కడైసి వివసాయి (ద లాస్ట్ ఫార్మర్)
ఉత్తమ కన్నడ చిత్రం	: 777 చార్లి
ఉత్తమ మలయాళ చిత్రం	: హోమ్
ఉత్తమ హిందీ చిత్రం	: సర్దార్ ఉద్దామ్
ఉత్తమ గుజరాతీ చిత్రం	: లాస్ట్ ఫిల్మ్ షో (ఛెల్లో షో)
ఉత్తమ మరాఠీ చిత్రం	: ఏక్దా కే జాలా
ఉత్తమ మీషింగ్ చిత్రం	: బూంబా రైడ్
ఉత్తమ అస్సామీస్ చిత్రం	: అనూర్ (ఐస్ ఆన్ ది సన్ షైన్)
ఉత్తమ బెంగాలీ చిత్రం	: కల్కోకో-హౌస్ ఆఫ్ టైమ్
ఉత్తమ మైథిలీ చిత్రం	: సమాంతర్
ఉత్తమ ఒడియా చిత్రం	: ప్రతీక్ష్య (ద వెయిట్)
ఉత్తమ మెయిటిలాన్ చిత్రం	: ఈఖోయిగీ యమ్ (అవర్ హోమ్)

పది అవార్డులతో తొలి రికార్డ్

ఈసారి తెలుగు పరిశ్రమ ఎక్కువ జాతీయ అవార్డులు సొంతం చేసుకోవడంతో పాటు మరో విశేషమైన రికార్డ్ సాధించింది. అదేంటంటే.. 27వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'శంకరాభరణం' (1980) సినిమాకు నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. 30వ జాతీయ చలన చిత్ర అవార్డ్స్‌లో 'మేఘ సందేశం' (1982)కి నాలుగు అవార్డులు వచ్చాయి. అలాగే 'దాసి' (1988) చిత్రం 36వ జాతీయ అవార్డ్స్‌లో ఐదు విభాగాల్లో అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాత తెలుగు సినిమాలకు ఐదుకు మించి అవార్డులు రాలేదు. 35 ఏళ్లకు రెండు ఐదులు.. అంటే పది అవార్డులు దక్కించుకుని తెలుగు చిత్రసీమ తొలి రికార్డ్‌ని సాధించింది.

'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'

భారతదేశ ప్రముఖ అంతరిక్ష శాస్త్రవేత్త నంబి యార్ నారాయణన్ జీవిత చరిత్ర ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. ఇస్రోలో చేరిన నారాయణన్ స్వదేశీ రాకెట్లను అభివృద్ధి చేసే ప్రాజెక్ట్‌లో భాగంగా రష్యా డెవలప్ చేసిన క్రయోజెనిక్ ఇంజన్స్‌ని భారత్‌కి తీసుకురావాలనుకుంటారు. ఇదే సమయంలో పాకిస్తాన్‌కు భారత రాకెట్ సాంకేతిక విషయాలను చేరవేశారనే నెపంతో అరెస్ట్ అవుతారు నారాయణన్. అరెస్ట్ తర్వాత కేరళ పోలీసుల విచారణలో ఆయన ఎలాంటి చిత్రహింసలు అనుభవించారు? ఆ తర్వాత ఆయన జీవితం ఎలా మలుపు తిరిగింది? తనపై వచ్చిన తప్పుడు ఆరోపణల నుంచి నారాయణన్ ఎలా విముక్తి పొందారు? అనే నేపథ్యంలో 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' సినిమా రూపొందింది. నంబియార్ నారాయణన్ పాత్ర చేయడంతో పాటు మాధవన్ దర్శకత్వం వహించారు. నారాయణన్ సతీమణి మీన క్యారెక్టర్‌లో హీరోయిన్ సిమ్రాన్ చక్కగా నటించారు. ప్రత్యేకించి ఆమె పండించిన భావోద్వేగాలు సినిమాకి హైలైట్. హీరో సూర్య అతిథి పాత్రలో మెరవడం కూడా ఈ సినిమాకి ప్లస్ అయ్యింది. ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది.



నా అభిప్రాయాన్ని బలంగా చెప్పాను - ఎంఎం శ్రీలేఖ

''ప్రతి ఏడాది తెలుగు సినిమాలంటే కొంచెం నిర్లక్ష్యం. కంటి తుడుపుగా ఒకటో రెండో అవార్డులు ఇస్తున్నారు. దీనిపై జ్యూరీలో గట్టిగా మాట్లాడేవారు కావాలి. తెలుగుకు ఎందుకు ఇవ్వరు? అని మాట్లాడ గలగాలి. అయితే ఆ సినిమాలో విషయం ఉండాలి.. లేకుంటే మాట్లాడలేం'' అన్నారు సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ. 69వ జాతీయ అవార్డుల్లో దక్షిణాది తరపున జ్యూరీలో శ్రీలేఖతో పాటు రచయిత్రి బలభద్రపాత్రుని రమణి ఉన్నారు. అవార్డులు ప్రకటించిన అనంతరం ఎంఎం శ్రీలేఖ 'సాక్షి'తో మాట్లాడుతూ - ''మామూలుగా ఫైనల్ ప్యానల్‌లో భోజ్‌పురి వాళ్లు ఉంటారు. వారికి మహానటి సావిత్రి గురించి ఏం తెలుస్తుంది? అందుకే జ్యూరీలో ఉన్న తెలుగువారు తెలుగు సినిమాల గురించి గట్టిగా చెప్పాలి. ఓ జ్యూరీ సభ్యురాలిగా నా అభిప్రాయాన్ని నేను బలంగా చెప్పాను. ఈసారి నేను ఏవైతే రావాలనుకున్నానో దాదాపు వాటికే వచ్చాయి. తొలిసారి తండ్రీ కొడుకులు కీరవాణి అన్నయ్య- కాలభైరవ ఒకే వేదికపై అవార్డులు తీసుకోనుండటం నాకో గొప్ప అనుభూతి. ఇక జ్యూరీ సభ్యులకు ఒత్తిడి ఉంటుందనుకుంటారు.. అలాంటిదేమీ లేదు. నిజాయతీగా నాకు ఏది అనిపిస్తే అది చెప్పాను'' అన్నారు.



ఉప్పెన

మెగా ఫ్యామిలీ నుంచి హీరోగా ఎంట్రీ ఇచ్చిన హీరోల్లో వైష్ణవ్ తేజ్ ఒకరు. ఆయన నటించిన తొలి చిత్రం 'ఉప్పెన'. ఈ సినిమా ద్వారా బుచ్చిబాబు సన డైరెక్టర్‌గా, కృతిశెట్టి హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ ముగ్గురూ తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ అందుకున్నారు. సముద్ర తీరాన ఉప్పాడ అనే పల్లెటూరు. స్కూల్ డేస్ నుంచే బేబమ్మ (కృతీశెట్టి) మీద ఇష్టం పెంచుకున్న మత్స్యకార కుటుంబానికి చెందిన ఆశీర్వాదం (వైష్ణవ్ తేజ్) నిత్యం తననే ఆరాధిస్తూ ప్రేమిస్తుంటాడు. ప్రాణం కంటే పరువు ముఖ్యం అనుకునే పెద్ద మనిషి శేషారాయనం (విజయ్ సేతుపతి). ఆయన కూతురు బేబమ్మ కాలేజీలో చదువుకుంటూ ఉంటుంది. ఆ సమయంలో తన మనసులోని ప్రేమను బేబమ్మకి చెబుతాడు ఆశీర్వాదం. తన స్వచ్ఛమైన ప్రేమను అర్థం చేసుకున్న బేబమ్మ కూడా ఆశీర్వాదాన్ని ప్రేమిస్తుంది. ఇద్దరూ ప్రేమలో ఉన్న విషయం శేషారాయనంకి తెలుస్తుంది. దీంతో ఆశీర్వాదం-బేబమ్మ కలిసి ఊరి నుంచి వెళ్లిపోతారు. ఈ విషయం బయటకి తెలిస్తే తన పరువు పోతుందని ఆర్నెళ్ల పాటు తన కూతురు ఇంట్లోనే ఉందని ఊరి జనాలను నమ్మిస్తాడు రాయనం. ఆరు నెలల తర్వాత అయినా బేబమ్మ ఇంటికి తిరిగొచ్చిందా? తన కులం కానివాడు తన కూతురిని ప్రేమించాడన్న కోపంతో ఆశీర్వాదంని శేషారాయనం ఏం చేశాడు? ఆశీర్వాదం-బేబమ్మ ప్రేమకథ ఎలాంటి మలుపు తీసుకుంటుంది? చివరికి వారిద్దరూ ఒక్కటయ్యారా ? లేదా అనేది 'ఉప్పెన' కథ. 2021 ఫిబ్రవరి 12న విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది.

